## పరిచయం

# ఆరాధనకైన పిలుపు

పది సంవత్సరాల తరువాత, మార్చి 1993లో నేను, నా భార్య బార్బరా జాంబియాకు తిరిగి వచ్చాం. నాంవియాంగ క్రైస్తవ సెకండరీ స్కూలునుండి ఒక వాహనాన్ని అప్పు తీసుకొని ఆదివారం ఉదయం సెయకససా గ్రామానికి నడుపుకొంటూ వెళ్లాం. పది సంవత్సరాలకు ముందు, ఆ గ్రామంలో సంఘ స్థాపనకు సహాయం చేశాం, ఒక కట్టడాన్ని నిర్మించుకొనడానికి క్రైస్తవులకు సహాయపడ్డాం. ఉదయం 10.00 గంటలకు ఆ స్థలానికి మేము చేరుకున్నప్పుడు, ఎవరూ కన్పించలేదు. మేము ఒక చెట్టు క్రింద నిలుచున్నాం. సంఘం యింకా అక్కడ కూడుతుందా అని ఆశ్చర్యపోతూ ఉండిపోయాం. ఎక్కువసేపు మేము ఆశ్చర్యపడనక్కరలేకపోయింది. కొద్ది నిమిషాల తరువాత, ఒక బాలుడు కన్పించాడు ఇనుప రాడ్‌తో చెట్టుక్రింద కట్టబడియుండిన మరొక డిస్క్‌ను కొట్టాడు. “అది ఆరాధనకు పిలుపు” ఆ రోజున వారితో ఆరాధించడానికి అతిథులున్నట్టు అది గ్రామస్తులకు సమాచారం.

అక్కడకు ఎవ్వరైనా రావడానికి అరగంట సమయం పట్టింది. పొదల్లో గుండా పలు మార్గాలలో ఒకరి తరువాత ఒకరు రాసాగారు. వారు మాకు వందనాలు చెప్పారు. చెట్టుక్రింద మాతో మాట్లాడారు, దాదాపు అందరు వచ్చేవరకు చూచారు. బిల్డింగ్‌లో పురుషులు ఒకవైపు, స్త్రీలు మరోవైపు కూర్చున్నారు. “Y” ఆకారంలో చెక్కలు ఎక్కువగా నిలిపి మట్టి నేలలోనికి దించారు.

వారి పాటల్లో మాకు తెలిసిన కొన్ని చాయలున్నాయి, అయితే వారు తొంగ భాషలో పాడారు. కొన్ని సంపూర్ణంగా మాకు తెలియనివి, ప్రత్యేకించి ఆఫ్రికా సంగీతంలో ఉన్నాయి. అది ఆఫ్రికాకు చెందిన విధానంలో ఆరాధనా అనుభవం. నేను అలవాటుపడిన ఆరాధనా పద్ధతి వేరుగా ఉంది, అయితే ఆరాధన జరుగుతుంది అనడానికి నా మనస్సులో ఏ విధమైన సందేహం లేదు.

మరొక సందర్భంలో, మద్రాసు, భారత్‌లో YMCA వద్ద కూడుకునే సంఘంలో మాటలాడడానికి నేను సోదరులు పీటర్ సాల్‌మన్‌తో వెళ్లాను. మేము అక్కడికి వచ్చేసరికి ఆరాధన జరుగుతూ ఉండింది. అక్కడ కుర్చీలుగాని, మెత్తని సీట్లుగాని లేవు. నేలమీద వేయబడిన చాపలమీద ఆరాధికులు కూర్చున్నారు లేక మోకరించారు. మేము అక్కడికి చేరేసరికి ఎక్కువమంది మోకరించి తలలువంచియున్నారు. ఒకతను ప్రార్థనలో నడిపిస్తున్నాడు. తలుపు దగ్గరకు రాగానే పీటర్ మోకరించాడు. నేను కూడ అలాగే చేశాను. దేవుని సింహాసనము యెదుట స్థానిక సంఘం అణకువతో కొనసాగుతుంది. ఆరాధన జరుగుతున్నట్టు నాకు స్పష్టంగా తెలిసింది.

నేను ఐదు ఆఫ్రికా దేశాల్లోని వేర్వేరు ఆరాధనా కూడికల్లో పాల్గొన్నాను, భారత్‌లో అనేక ప్రాంతాల్లోను, రెండు దక్షిణ ఆఫ్రికా దేశాల్లోను, ఆయా కరీబియన్ ద్వీపాల్లోను ఆరాధనల్లో ఉన్నాను. (లేఖనాల హద్దులో) అవన్నీ వేరుగా ఉన్నాయి, అయినా అవన్నీ పోలిక కలిగియున్నాయి. ఆరాధనా కూడికలలో నేను ఆశించే విషయాలను కొంత సర్దుబాటు చేసుకున్నాను. కొన్ని ఎక్కువ ఎంజాయ్ చేయగలవిగా ఉన్నా, కొన్నిటికంటె మరి కొన్ని వ్యక్తిగతంగా మేలు కలిగించినా, నేను ఆరాధించానా లేదా అనేది కూడిన స్థలంలో జరుగుతున్న దానికంటె, నా లోపల ఏమి జరుగుతుందో దానిమీద ఆధారపడియుంటుంది.

## ఆరాధన అంటే ఏమిటి?

సంఘం నిమగ్నమై చేసే కార్యకలాపాలలో ఆరాధన ఎక్కడో పాతిపెట్టబడినట్టుందా? కనుగొనబడడానికి వేచియున్నదై ఆరాధన స్థలంలోని ఒక మూలన పొంచియున్నదా? ఆరాధనకు సంబంధించిన నా తొలి జ్ఞాపకాలు "సంఘానికి (చర్చికి) వెళ్లేదిగా" ఉంటుంది. మనం "చర్చ్‌కి వెళ్లడం" కాదు, మనం "ఆరాధనకు వెళ్లడమని" సువార్తికులు మాటి మాటికి చెప్తూతూ ఉన్నా, ఆలాటి భావన నా మనస్సులో అంటుకుపోయింది. "మనం వెళ్లేది" ఆరాధనకు అయ్యున్నట్టయితే, అది ఏమిటో మనం కనుగొనడం అవసరమై ఉంటుంది. "ఆరాధన అని పిలిచేది ఎక్కువగా అది కాదు" అని A. W. Tozer అన్నాడు.[1]

"ఆరాధన" "ప్రేమ" వలె ఎరుకైన పదమైయున్నా నేడు జనులు పూర్ణంగా గ్రహించగల మాటల్లో నిర్వచించడం కష్టమైయుంది. కొందరిచే కోరబడినది యితరులచే అసహ్యించబడే దాన్ని గూర్చి అది పలుకుతుంది. దేవుని సముఖంలో ఉండడం యొక్క సంతుష్టికరమైన, ఆత్మను ఉత్తేజింపజేసే, రెఫ్రెషింగ్ అనుభవాన్ని కొందరు కోరుతారు. కొందరు వారి ఆరాధనను విసుగైన కాలయాపనగా భావిస్తారు.

Alfred P. Gibbs యిలా అన్నాడు, "గులాబి సుగంధ మాధుర్యాన్ని లేదా తేనె యొక్క రుచిలోని ఆనందాన్ని *వర్ణించడంకంటె* ఎక్కువ సులభంగా *అనుభవించవచ్చు.*"[2] గిబ్స్ రైటే కావచ్చు, కాని ఆరాధనకు మనం బైబిలు నిర్వచనాన్ని వెదకడం ప్రాముఖ్యం. లేకుంటే, మనం అనుభవించేది ఆరాధన అని తెలిసికోలేం. ఇలా చెప్పి, పలు మూలాలనుండి ఏరుకున్న ఆయా నిర్వచనాలను గిబ్స్ యివ్వ ప్రయత్నించాడు. "ఆరాధనకు" యివ్వబడిన కొన్ని నిర్వచనాలు ఏవంటే (1) "దైవికమైన అనుగ్రహం క్రింద ఉన్న కృతజ్ఞతా భావనతో హృదయం పొర్లిపారుట"; (2) "నెమ్మదిగానున్న ఆత్మ దేవుని సముఖమందు కుమ్మరింపబడుట"; (3) "అవసరతలతో గాక, దానికి సంబంధించిన దీవెనలతో గాక, దేవునితోనే హృదయం నింపబడుట"; (4) "తండ్రి దాతగా, కుమారుడు రక్షకుడుగా, పరిశుద్ధాత్మ అంతరంగంలో వసించే అతిథిగా హృదయం ఉల్లసించుట."[3]

"దేవుడు ఏమైయున్నాడో ఆయనను ఆయనగాను, నీవేమైయున్నావో అలా నిన్నుగాను గుర్తించి తగినట్టుగా స్పందించుట" అని Rick Atchley ఆరాధనను నిర్వచించాడు.[4]

ఆరాధన దేవుని యోగ్యతను మానవ దౌర్బల్యతను స్థిరపరచుతుంది. మనం దేవుని మీద ఆధారపడడాన్ని అది గుర్తుచేస్తుంది. ఆరాధన ఏమైయుందో గ్రహించడానికి ఈ నిర్వచనాలన్నీ సహాయపడుతుండగా, దానిలో ఉన్నదానినంతటిని ఏమియు వివరించ నేరదు. ఈ సందర్భంలో యింకా నిర్వచించే ప్రయత్నాలను చేయను. ఈ వరుసలోని పాఠాలతో మనం ముందుకు సాగుతుండగా, ఆరాధన యొక్క సంయుక్తమైన భావం స్పష్టంగా పెంచబడుతుంది. భవిష్యత్తు పాఠంలో “ఆరాధన” అని తర్జుమా చేయబడిన మన పదం ఎక్కడనుండి వచ్చిందో ఆ గ్రీకు పదాల అర్థం చూద్దాం.

## మనం ఎందుకు ఆరాధించాలి?

మనం ఆరాధించేటప్పుడు మనం బహు బలహీనులం ఎందుకంటే మనం మన దౌర్బల్యాలను అధికంగా ఎరిగినవారమైయుంటాం; అయినప్పటికి ఆరాధించేటప్పుడు మనం మహా బలవంతులం, ఎందుకంటే సర్వాధికారియైన దేవుని బలంమీద మనం ఒరుగుతాం. ఆరాధించ రమ్మని మనలను పిలిచేది దేవుడు. ఆ విధంగా ఆయన మనలను నిర్మించాడు. ఆరాధింపకుండ మనం వట్టివారమును, సిద్ధం చేయబడనివారమైయున్నట్టు ఎరిగేలా మనలను రూపించాడు. మనం దేవుని ఆరాధించకుంటే, మరి దేనినైనా ఆరాధింప జూస్తామని దేవునికి తెలుసు. ఆయన మనలను తన స్వరూపంలో, తన స్వభావం యొక్క విస్తరణగా చేశాడు (ఆదికాండము 1:26; 2:7 చూడు). ఇక్కడే మనం నిరంతరం ఉండ ఆయన మనలను నిర్మించలేదు. నిరంతరం ఆయనతో ఉండాలని ఆయన మనలను రూపించాడు. గనుక, ఆయన సముఖానికి మనం రావాలని, ఆయనను శ్రేష్ఠంగా ఎరిగి ఆయనను పోలి ఉండాలని, కోర్కె కలిగియుండాలని ఆయన కోరాడు. జనులు ఎవరిని లేక దేనిని ఆరాధిస్తారో ఆలాగు మారాలని వారు కోరుకుంటారు. ఆయనను మనం ఆరాధిస్తున్నట్టయితే, ఆయనలా మనం మారతాం. ఈ సత్యాన్ని ఈ క్రింది లేఖనాలు నొక్కి చెప్పుతున్నాయి:

> మరియు మనము మంటినుండి పుట్టినవాని పోలికను ధరించిన ప్రకారము పరలోక సంబంధి పోలికయు ధరింతుము (1 కొరింథీయులకు 15:49).
>
> మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు **ఆత్మ**చేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము (2 కొరింథీయులకు 3:18).
>
> ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమైయున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము (1 యోహాను 3:2).

సాధారణంగా మాట్లాడితే, దేవుడు నిజంగా కోరేదేమంటే, తనతో సహవాసానికి మానవ జాతిని పునరుద్ధరించడం. మనం ఆరాధకులమైయుంటే, మనం అబద్ధమాడలేం,

మోసగించలేం, దొంగిలించలేం, అవినీతిలో జీవించలేమని ఆయన ఎరుగును. సిలువ యొద్ద ఆయన మనకొరకు ఏమి జరిగించాడో దానియందలి మన విశ్వాసం ద్వారా దేవుడు మనలను శుద్ధీకరించగోరుతున్నాడు. ఆరాధన ద్వారా ఆయన మనలను శుద్ధీకరించగోరుతున్నాడు. ఆరాధన ద్వారా ఆయనతో మనం బాంధవ్యాన్ని నిలబెట్టు కున్నట్టయితే, ఆ బాంధవ్యంలో ఉన్న ఉపకారాలు, సంతోషాలు మనం పంచుకుంటామని కూడా ఆయన ఎరుగును. గనుక, ఆరాధన మన ప్రయోజనం కొరకేగాని ఆయన కొరకు కాదు.

దేవుని గూర్చిన భావనను కేవలం కొనియాడడం లేక ఆయన స్వభావం యొక్క ఒక ముఖాన్ని కొనియాడడం కాదుగాని, దేవుని సముఖానికే సమీపించడమైయుంది. ఆయనను ఆరాధించడం ఆయనయందు లీనమైపోవడం, ఆయనయందు చుట్టబడడం, ఆయన ఆశ్రయం యొక్క భద్రతలో ఆదరణను అనుభవించడం, ఆయన కాపుదల ప్రేమను పొందడమైయుంది. ప్రభువు తిరిగి వచ్చినప్పుడు, ఆయన నిత్య సముఖం కొరకు అది మనలను సిద్ధపరుస్తుంది. జనులు దేనితో కాలం గడుపుతారో దానిలా మారాలని ఉద్దేశిస్తారు. అతి సాధారణమైన రూపంలో, ఆరాధన అనేది ఆయనలా మారడానికి దేవునితో కాలం గడపడమైయుంది. ఆయన ఏమైయున్నాడో మనం అలా గుర్తించగలిగినప్పుడు, ఆయన యోగ్యుడు గనుక మనమాయనను స్తుతించి ఘనపరుస్తాం. "ఏ స్త్రీ, పురుషునికైన దేవుని ఆరాధించి మహిమపరచడమే – ప్రధాన గమ్యమైయుంది."[5]

## మనం ఎప్పుడు ఆరాధించాలి?

ఆదర్శంగా, క్రైస్తవ బహిరంగ సమాజ కూడికల కంటెను ఎక్కువ తరచుగా ఆరాధన ఉండాలి. లేఖనాల్లో ఆరాధన యొక్క ఆదేశాలును, ఉదాహరణలును బహు ఎక్కువగా వ్యక్తిగతమైనవి, కుటుంబ సంబంధమైనవై ఉన్నాయి. అయినా, ఒంటరియైన లేక కుటుంబ సంబంధమైన ఆరాధనకు సంబంధించిన ప్రశ్నలను నేను తరచుగా వినను. ఎక్కువ ఒంటరితనపు లేక కుటుంబపరమైన ఆరాధన జరుగుటలేదని దాని అర్థమా?

మనం ఆరాధనను గూర్చి ఆలోచించినప్పుడు, సాధారణంగా క్రైస్తవుల యొక్క బహిరంగ కూడికలను గూర్చి మనం మామూలుగా ఆలోచిస్తాం. ఏదియెలాగున్నా, మనం దేవుని ఒంటరిగా ఆరాధించకపోయినట్టయితే, ఆదివారమున ఆయనను ఆరాధించడానికి ఆత్మసంబంధంగా సన్నద్ధులమైయుండము ("వారములో మొదటి దినమున"), కొన్నిసార్లు దీన్ని "ప్రభువు దినమని" సూచిస్తారు. (అపొస్తలుల కార్యములు 20:7; 1 కొరింథీయులకు 16:2; ప్రకటన 1:10లను చూడు.)[6]

## మనం ఎలా ఆరాధించాలి?

కొన్ని ప్రత్యేకించి చూపబడ్డవి, ఆది సంఘంలో ఆరాధన ఎలా జరిగిందని చూపేవి కొన్ని ఉన్నా, 1 కొరింథీయులకు 11–14లో వారి సంఘ కూడికలను ఏలుబడి చేసిన కొన్ని సాధారణమైన సూత్రాలను పౌలు పెట్టాడు. 1 కొరింథీయులకు 11–14 అంతయు

సంఘ కూడికలను మనస్సులో ఉంచుకొని వ్రాయబడినట్టు అనేకమంది లేఖనముల విద్యార్థులు తలంచుతారు. ఈ నాలుగు అధ్యాయాలకు సంఘ కూడికయే సందర్భమని నేను వ్యక్తిగతంగా నమ్ముతాను. 11వ అధ్యాయం తొలి 16 వచనాలు సంఘ కూడిక యొక్క ఆరాధనకు సంబంధించినవా కావా అని కొందరు ప్రశ్నిస్తారు. ఏదియెలాగున్నా, 11:17నుండి ఏ ప్రశ్నా లేదు. "కూడి వచ్చుట" అనే ప్రయోగం సందర్భాన్ని స్పష్టంగా బయలుపరచుతుంది. ఆరాధనలో ఆ క్రైస్తవులు ఏమి చేస్తూ ఉండినా – మనం ఏది చేసినా – ఈ సూత్రాలు వర్తిస్తాయి.

**ఏమి చేయాలి**

1. *ప్రతి ఒక్కరికి మేలు కలగడానికి మనం కూడి రావాలి* (11:17). వారి సంఘ కూడికను భంగంచేసిన విభజనలు ఆ తరువాత వచనాలలో వర్ణించబడ్డాయి. వారి కూడికలలో వారు జరిగించిన ఎక్కువ భాగం ఆత్మ సంబంధమైన వారి అభివృద్ధికి అవరోధం కలిగించేదిగా ఉంది. దేవుని ఘనపరచడానికి బదులు వారు తమ్మును తాము ఘనపరచుకొంటున్నారు. వారి చర్యలు తమవైపు నిర్దేశితమైనవి కాక, దేవునివైపు నిర్దేశితం కావలసినవై ఉన్నాయి.

2. *మనం ఉద్దేశాన్ని మనస్సున ఉంచుకోవాలి* (11:27–29). ఈ సందర్భం యొక్క సూత్రము "ప్రభురాత్రి భోజనంలో పాలుపొందడం." "అయోగ్యంగా" అనే ప్రయోగం (27 వ.) "తప్పు ఉద్దేశంకొరకు, తప్పు స్వభావంతో" అనే అర్థం విదితమై ఉంది. కొరింథులో, ప్రభురాత్రి భోజనం కొరకు కూడే ఉద్దేశం పోగొట్టబడింది. తమ్మును తాము పరీక్షించుకొని (28 వ.), వారు ఎందుకు కూడివచ్చారో ఆ నిజమైన ఉద్దేశాన్ని గుర్తించమని పౌలు కోరాడు.

3. *మనం ఏక శరీరంగా పనిచేయాలి* (12:12–21). ఆరాధించడానికి గాను తన ప్రజలు కూడి రావలసిందిగా దేవుడు కోరాడు (హెబ్రీయులకు 10:25). ఆరాధన అనేది నిలువుగాను, సమాంతరంగాను ఉండాలి. అంటే, అది దేవునివైపు మాత్రమే గాక ఒకరితో మరి ఒకరి వైపుకును బాంధవ్యాలు కట్టబడాలి. ఆత్మ సంబంధమైన ఎదుగుదలకు ఒంటరియైన, కుటుంబపరమైన ఆరాధన చాల ప్రాముఖ్యమయ్యింది కాని ఒంటరియైన లేక కుటుంబపరమైనది యివ్వలేనిది అందరు కలిసి చేసే ఆరాధన యిస్తుంది. విశ్వాసాన్ని కట్టుకునే కార్యంలో కలిసి పాలుపొందడం సహవాసము అన్యోన్య ప్రోత్సాహము పెంపొరుతుంది. సంఘ కూడికలో విభజనలు ఉంటే అన్యోన్య సహవాసం ఉండదు. ఒకరు ఒకదాన్ని ప్రీతిగా కోరుకుంటూ, మరొకరు యింకోదాన్ని అలాగే కోరుకొనడంలో సమాంతరపు బాంధవ్యాలు దెబ్బతింటాయి. మన సమాంతరపు బాంధవ్యాలు దెబ్బ తిన్నప్పుడు (దైవ మానవులకు మధ్యగల వ్యక్తిగత బాంధవ్యం) పైకి క్రిందికి గల బాంధవ్యాలు దెబ్బ తింటాయని మనం గమనించం.

4. *బలహీనులైన సభ్యులకు అధిక గౌరవం ఇస్తూ మనం ఒకరియెడల ఒకరం శ్రద్ధ కలిగియుండాలి* (12:22–25ను యాకోబు 2:1–13తో పోల్చి చూడు). మనలాంటివారు కాని సభ్యులను మనం అలక్ష్యమో లేక తప్పించుకొనడమో చేస్తాం.

ధనవంతుల పక్షంగా ఉండే సమస్యను ప్రత్యేకించి యాకోబు మాట్లాడాడు. దేవుని ప్రసన్నతలో దేవుని ప్రజలందరు సమానంగా ఉండే క్షేమకరమైన చోటు కూడిక. లోకం చూచునట్టుగా సంఘం పేదలను, తక్కువగా కోరదగినవారిని లేక తృణీకరింపబడినవారిని చూడదు. తృణీకరింపబడినవారికి, హీన దశలో ఉన్నవారికి, సమాజంచే అవమానపరచ బడినవారికి సంఘ కూడిక లోకంనుండి పారిపోయి దాగెడు చోటైయుంటుంది. సమాజంలోనికి రావడమంటే, నిర్మలమైన గాలిని పీల్చుకొనడానికి వచ్చినట్టుంటుంది. అక్కడ, అన్యోన్యతను, అక్కరను ప్రతి ఒక్కరికి సమానమైన గౌరవమును మనం కనుగొన వలసినవారమైయున్నాం.

5. *ప్రతి ఒక్కరిని మనం ప్రేమతో పరామర్శించవలసినవారమైయున్నాం* (13:1–8). నేనును మరియొక సహోదరుడు ఈ లేఖన భాగాన్ని చర్చించుకునేవరకు, 13వ అధ్యాయంలోని ప్రేమ అనే యోచన ఆరాధనకు మధ్య వచ్చిన ఉపదేశంగా నేను గమనించనే లేదు.[7] నిరాక్షేపంగా, ఈ ఉపదేశం యితర చోట్ల కూడ వర్తింపు కలిగియుంది; కాని ప్రత్యేకమైన సందర్భం కలిసి చేసే ఆరాధనలో ఒకరినొకరు ఎలా పరామర్శించుకోవాలనేదియే. ఈ క్రైస్తవులు ప్రాథమికంగా వెంటాడవలసింది ప్రేమయే (14:1). ఇతరుల యొక్క అవసరతలను వారి యిష్టాయిష్టాలను ప్రేమ మొదటిగా ఆలోచిస్తుంది. ఆరాధనా కూడికలలో క్రైస్తవులు మసలుకొనే విధానానికి వర్తింపజేస్తూ నేను 1 కొరింథీయులకు 13వ అధ్యాయాన్ని చదివినప్పుడు, ఆ అధ్యాయమంతా నాకు (క్రొత్త) నూతన భావాన్ని యిచ్చింది.

6. *ఒకరికొకరం క్షేమాభివృద్ధి కలిగించుకో వెదకాలి* (14:3, 4, 5, 12, 17, 26, 31). ఆయా రూపాల్లో 14వ అధ్యాయంలోని కీలకమైన పదం "క్షేమాభివృద్ధి చేసికొనడం" నీవు చదివే తర్జుమాలపై ఆధారపడి, క్షేమాభివృద్ధి కలిగించుకొనడానికి ఆరాధించడం అవసరమని కనీసం ఏడుసార్లు పౌలు నొక్కి చెప్పాడు. "క్షేమాభివృద్ధి కలిగించడం" అంటే "కట్టడం" అని అర్థం. ముందుగా చెప్పబడిన అయిదు సూత్రాల సంయుక్త ఫలితంగా క్షేమాభివృద్ధి కలుగుతుంది. లోకమును, సాతానును చీల్చి క్రిందికి త్రోయాలని దేన్ని చూస్తున్నాయో ఆరాధన తిరిగి దాన్ని పునః నిర్మాణం చేస్తుంది.

7. *సమస్త కార్యాలు మనం క్రమంగా, మర్యాదగా చేయాలి* (14:40). దేవుడు తారుమారును అంగీకరించడు, తన అసమ్మతిని తెలియచేయడు. ఆరాధన కూడికలలో ఏదైనా తారుమారు నరునివలననే కలుగుతుంది. తారుమారు కలిగించే ఆత్మ కూడికలో తిరుగుతుంటే అది ఖచ్చితంగా పరిశుద్ధాత్మ కాదు.

**ఏమి జరిగించకూడదు**

సరియైన కార్యాలు జరిగించి, సరియైన మాటలు పలికి, సరియైన పాటలు పాడి కూడి ఆరాధించడాన్ని కోల్పోయేలా ఉండడానికి మనం సంఘ కూడికలోనికి రాకూడదనేది మన అతి ప్రధానమైన అక్కరయై ఉండాలి. పలు కారణాలను బట్టి యిది జరగాలి:

*మొదటిది, తప్పు ఉద్దేశం కొరకు మనం కూడితే మనం ఆరాధించలేం.* యెషయా 29:13నుండి కోట్ చేస్తూ మత్తయి 15:8లో (ప్రభువైన) యేసు యిలా హెచ్చరించారు:

"ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరతురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది."

*రెండవది, మన జీవితాల్లో పాపం ఉంచుకొని మనం ఆరాధించలేం.* ఆరాధన అనంగీకారంగా ఉన్న పరిస్థితిని ప్రవక్తయైన ఆమోసు వర్ణించాడు. తన కాలపు ప్రజలు పండుగలనాచరించారు, దహన బలులు అర్పించారు, ఆత్మసంబంధమైన పాటలు పాడారు; కాని వారి జీవితాలు చెడిపోయినవై ఉన్నందున దేవుడు వారి ఆరాధనను అంగీకరించలేదు (ఆమోసు 5:21-27).

*మూడవది, సహోదరుని గాయపరచే ఏదైనా ఒకటి చేసినందున మనం ఆరాధించలేం.* ప్రభువైన యేసు యిలా అన్నారు, "కావున నీవు బలిపీఠమునొద్ద అర్పణము నర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటు తరువాత వచ్చి నీ యర్పణమునర్పింపుము" (మత్తయి 5:23, 24).

"సంఘ ఆరాధనను" హార్డింగ్ యూనివర్సిటి కోర్సుగా అనేక సంవత్సరాలు ఉపదేశించి దివంగతుడైన Andy T. Ritchie Jr. "అనుదిన జీవితం ఆయనతో పొందికలేకయున్నట్టయితే ఆరాధన దేవునికి అంగీకారమైయుండదు" అని అన్నాడు.[8] మన జీవిత వైఖరిని మార్చడానికి దేవుడు ఆరాధనను నియమించాడు. ఆయనకు అవసరం గనుక మనం ఆయనను ఆరాధించాలని దేవుడు కోరలేదు. ఆయన సర్వాధికారి, తనయందు తనకే సంపూర్ణత కలవాడైయున్నాడు. మనం యిచ్చేది ఏదీ ఆయనకు అవసరమైయుండదు. ఆరాధనలో ఆయన మనలను ఆత్మ సంబంధమైన ఔన్నత్యానికి పిలుస్తున్నాడు.

## ముగింపు

ఆరాధన విషయంలో జనులకు కలిగే అనేక సంశయాలలో చిక్కుకోడం నా ఉద్దేశం కాదు. ఆరాధన అంటే ప్రధానోద్దేశం ఏమిటో తెలుసుకుంటే అవన్నీ అంతరించిపోతాయి. ఆరాధన రూపము లేక వైఖరిని గూర్చినది కాదు. నేను దేన్ని యిష్టపడతాను లేక కోరుకుంటాను కాదు గాని, దేవునికి ఏది ప్రీతికరమై ఉంటుందో దాన్ని గూర్చినది ఆరాధన. తన వ్యక్తిగతమైన తలాంతును ప్రతి ఒక్కరు ప్రదర్శించుకొనడానికి ఆరాధన కూడికలు రూపింపబడలేదు, కాని ప్రతి ఒక్కరిని దేవుని సన్నిధానానికి ఆకర్షించడానికి ఉద్దేశించబడ్డాయి. "సంఘేతరునితో" సంబంధం కలిగి ఉండడానికి కూడ ఆరాధన ఉద్దేశం కాదు. క్రొత్త నిబంధన ఆరాధన క్రైస్తవుల కొరకైన ఉత్సాహ కార్యము. అంతమాత్రాన, మన స్థానిక సంఘ కూడికలకు వచ్చిన అతిథుల అక్కరలను అలక్ష్యపెట్టమని దాని ఉద్దేశం కాదు. ఏదియెలాగున్నా, దేవునితో సరియైన అవగాహన లేని అతిథికి ఆరాధనలో జరిగే ప్రతిదీ సంబంధం కలిగియుండేలా చేయడం ఆరాధన యొక్క నిజమైన ఉద్దేశం కాదు.

## సూచనలు

[1]A. W. Tozer, *Whatever Happened to Worship?,* comp. and ed. Gerald B. Smith (Camp Hill, Pa.: Christian Publications, 1985), 37. [2]Alfred P. Gibbs, *Worship: The Christian's Highest Occupation,* 2d ed. (Kansas City, Kans.: Walterick Publishers, n.d.), 15. [3]Ibid., 15-17. [4]Rick Atchley, "What a Left-brained Preacher Has Learned," Part 1, *Pepperdine Lectures* (Malibu, Calif.: Pepperdine University Media Center, 1998), cassette. [5]Tozer, 51-52. [6]"ప్రభువు దినపు రాత్రి భోజనం" అనేది "నన్ను జ్ఞాపకము చేసికొనుటకు" అనే పాఠంలోను, "ఎంత తరచుగా ప్రభురాత్రి భోజనాన్ని ఆచరించాలి?" అనే పాఠములోను – తరువాత ఈ పుస్తకంలో కన్పిస్తాయి. [7]Lubbock, Texasలోని Gary Walkerతో సంభాషించినప్పుడు, ఆరాధనపై అధికమైన ఆదేశానికి మధ్య "ప్రేమ" అధ్యాయం వస్తుందని అతడు సూచించాడు. [8]Andy T. Ritchie Jr., Class Lecture Notes, The Worship of the Church, Harding University, n.d.